సాక్షి కర్నూలు

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



శ్రీమఠంలో తమిళనాడు డీజీపీ

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి దర్శనార్థం తమిళనాడు డీజీపీ శంకర్ జివాల్ శనివారం మంత్రాలయం వచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో కాసేపు ముచ్చటించారు.



ప్రతీకాత్మక చిత్రం

వజ్రం లభ్యం

తుగ్గలి: మండల పరిధిలోని సూర్యతండాలో శనివారం పొలం పనులకు వెళ్లిన ఓ మహిళకు వజ్రం లభ్యమైనట్లు సమాచారం. అయితే ఈ వజ్రాన్ని ఇంకా విక్రయించనట్లు తెలిసింది.



సెపక్‌తక్రాలో 'మధు'ర విజయం

క్రీడల్లో రాణించేందుకు పేదరికం అడ్డురాదని నిరూపించాడు ఆదోని పట్టణానికి చెందిన మధు. పట్టుదలతో సాధన చేసి అంతర్జాతీయ పోటీలకు ఎంపియ్యాడు.

8లో▸

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి కపర్ది

కర్నూలు (లీగల్): లోక్‌అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు న్యాయస్థానాల చుట్టూ తిరిగి తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా సామరస్యంగా చర్చించుకుని లోక్‌అదాలత్‌లో పరిష్కారం పొందాలన్నారు. ఫ్యామిలీ కోర్టు జడ్జి జి.ప్రతిభా దేవి మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలకు కక్షిదారులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తుండటంతో కేసుల సంఖ్య పెరిగిపోయిందన్నారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి పి.పాండురంగా రెడ్డి, మహిళా కోర్టు జడ్జి బి.భూపాల్‌రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జీఎల్‌వీ శేషాద్రి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.దివాకర్, జూనియర్ సివిల్ జడ్జీలు టి.జ్యోత్స్న దేవి, ఎం.సరోజనమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కర్నూలు న్యూసిటీ: మిలాద్‌నబీ పండుగను పురస్కరించుకుని ఈనెల 16న నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)ను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్ స్థాయిలో, మున్సిపాలిటీ పరిధిలో, మండల స్థాయిలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించడం లేదని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

ఘనంగా శుద్ధ ఏకాదశి వేడుక



భక్తులకు తప్త ముద్రలు వేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో శనివారం భాద్రపద శుద్ధ ఏకాదశి వేడుక వైభవంగా జరిగింది. ఏకాదశిని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాములోరి సంస్థాన పూజ అట్టహాసంగా నిర్వహించారు. స్వామిజీ తప్త ముద్రణ చేసుకుని ఏకాదశి ప్రాముఖ్యతను చాటారు. అలాగే ఏకాదశి సందర్భంగా భక్తులకు నిజరూప బృందావన కల్పించింది. భక్తులకు సైతం స్వామిజీ తప్త ముద్రలు వేశారు.

మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ.3.13 లక్షలు

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి భాద్రపదమాసం శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లకు భక్తుల వివిధ సేవలు నిర్వహించుకోవడంతో రూ.3,13,720 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

పేద మెరిట్ విద్యార్థులకు అన్యాయం



మా నాన్న టెక్నికల్ మేనేజర్. మెడిసిన్ చదివేందుకు ర్యాంకు సాధించాలని చాలా మంది కష్టపడుతుంటారు. ర్యాంకు తెచ్చుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తుంటారు. అలాంటి వారిలో నేనూ ఒకన్ని. ప్రైవేటు మెడికల్ కాలేజీలైతే చదువు కొనుక్కోవాలి. అక్కడ వైద్యులు, సిబ్బందితో పాటు రోగులు కూడా తక్కువే. కానీ ఫీజు చాలా ఎక్కువగా ఉంటుంది. అదే ప్రభుత్వ కాలేజీలు అయితే అన్ని వసతులు, సౌకర్యాలతో పాటు మంచి ప్రొఫెసర్లు ఉంటారు. వారివద్ద వైద్యవిద్యను బాగా నేర్చుకునే అవకాశం ఉంటుంది. రోగులు ఎక్కువ మంది వస్తారు కాబట్టి ప్రాక్టికల్స్‌కు అవకాశం ఎక్కువ. ఈ తరుణంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే పేద మెరిట్ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. –ఎం. కార్తీక్, కర్నూలు



ప్రైవేట్‌కు ఇస్తే నష్టపోతాం



నాన్న ప్రైవేటు కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. నేను 10వ తరగతిలో 483 మార్కులు(సీబీఎస్‌ఈ), ఇంటర్ మొదటి సంవత్సరంలో 433/440 మార్కులు సాధించాను. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఫీజు ఎక్కువగా...సౌకర్యాలు తక్కువగా ఉంటాయి. రోగులు కూడా పెద్దగా ఉండరు. అక్కడ నేర్చుకోవడానికి పెద్దగా అవకాశం ఉండదు. ఈ కారణంగానే చాలా మంది ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించాలని తపన పడుతుంటారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను సైతం ప్రైవేటు వారికి అప్పగిస్తే మేనేజ్‌మెంట్ కోటా సీట్లు పెరిగి పోయి ఫీజులు భారం అవుతాయి. సామాన్య, మధ్యతరగతి మెరిట్ విద్యార్థులు ఇలాంటి చోట చదవలేని పరిస్థితి దాపురిస్తుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వం ఆలోచించాలి. –డి. హేమసాగరిక, కర్నూలు



విద్యుత్‌దీపాలంకరణలో కేసీకెనాల్‌లోని ప్రధాన ఘాట్

నేడే మహా వేడుక

- కర్నూలులో గణేశ్ నిమజ్జనోత్సవానికి సర్వం సిద్ధం
- సుందరంగా ముస్తాబైన వినాయక ఘాట్
- రాంబొట్ల ఆలయం నుంచి ప్రారంభం కానున్న శోభాయాత్ర
- రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు
- నిమజ్జన ప్రాంతంలో 120 మంది గజ ఈతగాళ్లు
- సేవలందించనున్న రెండు వేల మంది స్వచ్ఛంద సేవకులు

కర్నూలు కల్చరల్: అద్వితీయ ఘట్టానికి వేళైంది.. మహా వేడుక ఆదివారం ప్రారంభం కానుంది.. వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం కనుల పండువగా సాగనుంది.. ఇందుకోసం జిల్లా అధికారులు, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వినాయక చవితిని పురస్కరించుకొని ఈనెల 7వ తేదీ మండపాల్లో గణనాథున్ని కొలువుంచారు. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న బొజ్జ గణపయ్య ఆదివారం తల్లి గంగమ్మ ఒడిలోకి చేరేందుకు శోభాయాత్రగా కర్నూలు వినాయక్ ఘాట్ కేసీ కెనాల్‌కు తరలి రానున్నారు. కర్నూలు నగరంలో 1980లో రెండు విగ్రహాలతో గణేశ్ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఏటేటా విగ్రహాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ సంవత్సరం విగ్రహాల సంఖ్య 2,400కు చేరుకుంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో గణేశ్ మహోత్సవాల నిర్వహణలో కర్నూలుకు ప్రత్యేకత స్థానం ఉంది. ఏపీలో ఎక్కడా లేనివిధంగా నగరం నడి మధ్యలో కేసీ కాల్వలో విఘ్నేశ్వరునికి వీడ్కోలు కార్యక్రమం అత్యంత శోభాయమానంగా నిర్వహిస్తారు. నిమజ్జన ఘాట్‌లకు తుంగభద్ర, గంగ, కృష్ణవేణి, కావేరి పేర్లతో నామకరణం చేశారు. వినాయక్ ఘాట్ పక్కనున్న సత్యనారాయణ స్వామి ఆలయంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లు ఇవీ..

- ➡ వినాయక ఘాట్‌లో మొత్తం పది ప్రాంతాల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. ఏడు చోట్ల క్రేన్లతో మూడు చోట్ల చేతుల మీదుగా నిమజ్జనం చేయనున్నారు. స్టాంటన్‌పురం కేసీ కెనాల్ వద్ద ఘాట్‌ను ఏర్పాటు చేశారు.
- ➡ ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో బారికేడ్లు, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వీధి దీపాల ఎత్తు పెంచడంతో పాటు ఘాట్ వద్ద జనరేటర్లు ఏర్పాటు చేశారు.
- ➡ వినాయక ఘాట్ వద్ద మత్స్య శాఖ ఆధ్వర్యంలో 120 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.
- ➡ డిస్ట్రిక్ ఫైర్ శాఖ ఆధ్వర్యంలో నాలుగు ఫైర్‌ఇంజన్లను, ఏపీటూరిజం శాఖ అధ్వర్యంలో రెండు బోట్లను సిద్ధంగా ఉంచారు.
- ➡ నగరంలోని అన్ని మద్యం దుకాణాలను 36 గంటల ముందే మూసివేయనున్నట్లు ఎక్సైజ్ శాఖ కమిషనర్ ప్రకటించారు.
- ➡ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వినాయక్ ఘాట్ పరిసర ప్రాంతాల్లో రంగు రంగుల విద్యుత్ దీపాలు, ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు.
- ➡ ప్రధాన కూడళ్లలో తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య పనుల నిర్వహణకు సుమారు 370 మంది సిబ్బంది అందుబాటులో ఉంచారు.
- ➡ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య బృందాలు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి.
- ➡ అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో 11 మంది డీఎస్పీలు, 58 మంది సీఐలు, ఆర్‌ఐలు, 138 మంది ఎస్‌ఐలు.. మొత్తం రెండు వేల మంది బందోబస్తు విధులు నిర్వహించనున్నారు.
- ➡ మహిళలకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు.
- ➡ గణేశ్ నిమజ్జనోత్సవ ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ శనివారం పరిశీలించారు. ఆయన వెంట జేసీ డాక్టర్ బి.నవ్య, ఎస్పీ బిందు మాధవ్, నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్, 25వ వార్డు కార్పొరేటర్ సిత్రా సత్యనారాయణమ్మ, గణేశ్ మహోత్సవ కేంద్ర సమతి సభ్యులు ఉన్నారు.

నిమజ్జనోత్సవం సాగుతుందిలా..

- ➢ రాంబొట్ల దేవాలయం వద్ద ఉదయం 9 గంటలకు నిమజ్జనోత్సవ మొదటి ఊరేగింపు, మధ్యాహ్నం 12 గంటలకు హనుమాన్ జంక్షన్ వద్ద రెండో ఊరేగింపు, మధ్యాహ్నం 2 గంటలకు కల్లూరు చౌరస్తా వద్ద మూడో ఊరేగింపు, అదే సమయానికి నంద్యాల చెక్ పోస్టు వద్ద నాలుగో ఊరేగింపు ప్రారంభం అవుతాయి.
- ➢ వినాయక్ ఘాట్‌లో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.
- ➢ మధ్యాహ్నం 2 గంటలకు వినాయక ఘాట్‌లో నిమజ్జనం ప్రారంభమవుతుంది.
- ➢ ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంఘ్ చాలక్ జి. నీలకంఠం వినాయక ఉత్సవాల సందేశాన్ని ఇస్తారు.
- ➢ నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షులు డాక్టర్ పి. మోక్షేశ్వరుడు, ప్రధాన కార్యదర్శి బి.వేణుగోపాల్, జిల్లా సమన్వయకర్త డాక్టర ఎం.నాగఫణిశాస్త్రి, కర్నూలు నగర ప్రధాన కార్యదర్శి జంపాల జనార్దన్ పర్యవేక్షించనున్నారు.



నిమజ్జనానికి సిద్ధమైన రాంబొట్ల విగ్రహం



వినాయక ఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, కార్పొరేటర్, ఉత్సవ సమితి సభ్యులు

సమయపాలన పాటించాలి



నిర్దేశించిన సమయానికి వినాయక విగ్రహాలతో ఊరేగింపుగా బయలు దేరాలి. సమయపాలన పాటిస్తేనే నిమజ్జనం ఆలస్య కాకుండా పూర్తవుతుంది.

– బి.వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి

అధికారులకు సహకరించాలి



సంస్కృతి, సంప్రదాయాలు వెల్లివిరిసేలా శోభాయాత్రలో పాల్గొనాలి. అధికారులు, పోలీస్ వారికి కార్యకర్తలు సహకరించాలి.

– మోక్షేశ్వరుడు, ఉత్సవ సమితి నగర అధ్యక్షుడు

అప్రమత్తంగా ఉండండి

కర్నూలు: గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసేలా పటిష్ట చర్యలు చేపట్టాలని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఎస్పీ బిందుమాధవ్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయ పరేడ్ మైదానంలో బందోబస్తు నిమిత్తం వచ్చిన పోలీసులు, సిబ్బందితో శనివారం సాయంత్రం ఎస్పీ సమావేశమై దిశా నిర్దేశం చేశారు. హైదరాబాద్ తర్వాత గణేష్ నిమజ్జనానికి కర్నూలులో అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి సంవత్సరం విగ్రహాల సంఖ్య పెరుగుతూ వస్తున్నాయని, నిమజ్జనం పూర్తయ్యేవరకు పోలీసు అధికారులు గట్టిగా పనిచేయాలన్నారు. నిమజ్జనం ఘాట్ వద్ద విధులు నిర్వహించేవారు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమజ్జన కార్యక్రమ ప్రాంతాన్ని ఏడు సెక్టార్లుగా విభజించి ఒక్కొక్క సెక్టార్‌కు ఒక డీఎస్పీ పర్యవేక్షణలో సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులు, ప్రజల పట్ల పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు.



కర్నూలులో ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వీకర్ సెక్షన్ కాలనీలో పోలీసు కవాతు

కర్నూలు శివారులోని సమస్యాత్మక ప్రాంతం వీకర్ సెక్షన్ కాలనీలో శనివారం సాయంత్రం ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఉంటే డయల్ 100కు గాని, డయల్ 112కు గాని ఫోన్ చేసి సమాచారమివ్వాలని ఎస్పీ కాలనీ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సీఐలు ప్రసాద్, కేశవరెడ్డి, అబ్దుల్ గౌస్, మధుసూదన్‌గౌడ్, శేషయ్య, ఆర్‌ఐ సోమశేఖర్ నాయక్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పని చేయాల్సిందే!

కర్నూలు(అర్బన్): వరుసగా రెండో శనివారం, ఆదివారం, సోమవారం మిలాద్‌నబీ సెలవులు వచ్చాయి. అయితే ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులకు మాత్రం సెలవులు లేవు. ఈ శాఖకు సంబంధించి జిల్లా స్థాయిలోని పర్యవేక్షక ఇంజినీరుతో పాటు నాల్గవ తరగతి ఉద్యోగుల వరకు సెలవు రోజుల్లో కూడా పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గత నెలలో కూడా రెండో శనివారం, ఆదివారం విధులు నిర్వహించారు. ప్రస్తుతం మూడు రోజుల సెలవులను కూడా వారు కార్యాలయాల్లోనే గడుపుతున్నారు. పల్స్ సర్వే ఫార్మెట్లు పంపాలని ఈఎన్‌సీ నుంచి మౌఖిక ఆదేశాలు జిల్లా అధికారులకు అందాయి. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న ఇంజినీర్లు, మినిస్ట్రీరియల్ ఉద్యోగులందరూ సెలవు రోజుల్లో కూడా పనిచేస్తున్నారు. పల్స్ సర్వే, జేజేఎం పనులు, ప్రతి వ్యక్తికి 55 ఎల్‌పీసీ నీరు అందిస్తున్నారా? తదితర అంశాలపై ఈ నెల 17న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించనున్న దృష్ట్యా, సెలవు రోజుల్లో కూడా ఫార్మెట్లను పంపించే పనిలో ఇంజినీర్లు, ఉద్యోగులు నిమగ్నమయ్యారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెలవు రోజుల్లో కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడిపేందుకు కూడా వీలు లేని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన చెందుతున్నారు.



ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఆదోనిలో అనాచారం

- మృతదేహాన్ని తీసుకురావొద్దన్న కాలనీవాసులు

ఆదోని అర్బన్: బతికిన రోజుల్లో ఎలాగున్నా.. చనిపోయిన తర్వాత గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. అయితే ఆదోని పట్టణంలోని ఓ కాలనీలో పోస్టుమార్టం చేసిన మృతదేహాన్ని ఇంటి వద్దకు తీసుకురాకుండా స్థానికులు అడ్డుకున్నారు. అనంతపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదోని పట్టణం శంకర్‌నగర్ కాలనీకి చెందిన కృష్ణ కుమారుడు రాఘవేంద్ర మృతిచెందారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. శనివారం మృతదేహాన్ని ఇంటికి తీసుకొస్తుండగా.. పోస్టుమార్టం చేసిన మృతదేహాన్ని తీసుకురావద్దని శంకర్‌నగర్ కాలనీ వాసులు కొందరు అడ్డుకున్నారు. కాలనీకి అరిష్టమని చెప్పడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చిన్నమార్కెట్‌లో ఉన్న ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

క్వింటా ఉల్లి గరిష్ట ధర రూ.4,211

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధర కాస్త పెరిగింది. శనివారం మార్కెట్‌కు 187 మంది రైతులు 6,610 క్వింటాళ్ల ఉల్లిగడ్డలను తీసుకొచ్చారు. కనిష్ట ధర రూ.297, గరిష్ట ధర రూ.4,211 లభించింది. 'సాక్షి'లో ఉల్లి రైతులకు సిండికేట్ దెబ్బ శీర్షకన కథనం ప్రచురితమైన నేపథ్యంలో వ్యాపారుల్లో కొంత మార్పు కనిపించింది. సగటు ధర రూ.3,211 నమోదు కావడం విశేషం. ఎక్కువ లాట్లకు రూ.3వేల నుంచి రూ.3,500 వరకు ధర లభించినట్లు స్పష్టమవుతోంది. ● కొర్ర ధర మరింత తగ్గడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. 33 మంది రైతులు 354 క్వింటాళ్ల కొర్రలు తీసుకొచ్చారు. కనిష్ట ధర రూ.1,309, గరిష్ట ధర రూ.2,719 లభించగా.. సగటు ధర రూ.2,611 నమోదైంది. ● వేరుశనగ ధర కూడ తగ్గింది. మార్కెట్‌కు 256 మంది రైతులు 2,373 క్వింటాళ్ల వేరుశనగ తెచ్చారు. కనిష్టం రూ.1,198, గరిష్టం రూ.7,211 లభించగా.. సగటు ధర రూ.5,689 నమోదైంది. ● ఆముదం, వేరుశనగ, కొర్ర, పొద్దుతిరుగుడు పంటలకు ధరలు పడిపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

స్పందించిన మార్కెటింగ్ శాఖ డైరెక్టర్

'సాక్షి'లో ఉల్లి రైతులకు సిండికేట్ దెబ్బ శీర్షకన కథనం ప్రచురితమైన నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత స్పందించారు. రైతులు నష్టపోకుండా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఏడీఎం నారాయణమూర్తి, మార్కెట్ కమిటీ సెక్రెటరీ గోవిందును ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఉల్లి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. నాణ్యతకు అనుగుణంగా రేట్లు ఉండాలని, సిండికేట్‌గా మారితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యాపారుల భయమే 'సొమ్ము'

ఇన్‌కమ్ ట్యాక్స్ ముసుగులో చెలరేగిన సైబర్ నేరగాళ్లు

- మాయ మాటలతో వ్యాపారులకు బురిడీ
- జీఎస్‌టీ వివరాలతో దాడులకు వస్తున్నామంటూ ఫోన్లు
- దాడులు ఎందుకనుకుంటే ఫోన్‌పేకు డబ్బులు వేయాలని బేరం
- అడిగిన వివరాలు సక్రమంగా ఉండటంతో వ్యాపారుల బెంబేలు
- ఒక్కొక్కరి నుంచి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు వసూలు
- ఆదోనిలో రూ.కోటికి పైనే కొల్లగొట్టినట్లు అంచనా



సైబర్ నేరగాడు: హలో! నేను ఇన్‌కమ్ ట్యాక్స్ వార్డు-1 ఇన్‌స్పెక్టర్‌ను. మీ పేరు, సంస్థ వివరాలు ఇవేనా?

వ్యాపారి: సార్! నేనే. చెప్పండి.

సైబర్ నేరగాడు: నీవు ఫైల్ చేసిన ఇన్‌కమ్ ట్యాక్స్ వివరాలను ముందు పెట్టుకుని మాట్లాడుతున్నా. ఇంత మొత్తానికి ఫైల్ చేశావు. గత సంవత్సరం ఎంత టర్నోవర్ ఉంది?

వ్యాపారి: (వివరాలన్నీ సక్రమంగానే ఉండటంతో నిజమైన ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారిగా భావించి) గత సంవత్సరం ఫైల్ చేసిన మొత్తం చెప్పేశాడు.

సైబర్ నేరగాడు: నీ ఫైల్ తీసుకొని రెండు గంటల్లో ఐటీ సార్ మీ షాపునకు వస్తారు. వివరాలన్నీ దగ్గర ఉంచుకోండి? ఇదంతా ఎందుకు అనుకుంటే ఫార్మాలిటీస్ చెబుతా?

వ్యాపారి: చెప్పండి సార్. ఎంత ఇవ్వమంటారు.

సైబర్ నేరగాడు: నీ ఫైల్‌ను పక్కన పెట్టించేస్తా. 8121516585 నెంబర్‌కు రూ.15వేలు ఫోన్ పే చేయండి. ఈ మొత్తం నాకు ఒక్కనికే కాదు, ఆఫీసులో అందరికీ ఇవ్వాల్సి ఉంటుంది.

వ్యాపారి: సైబర్ నేరగాడు చెప్పిన మొత్తం ఫోన్‌పే చేసి, హమ్మయ్యా! ఇన్‌కమ్ ట్యాక్స్ బారి నుంచి బయటపడ్డానని సంబరపడ్డాడు.

.. ఇదీ గత 15 రోజులుగా ఆదోని పట్టణంలో జరుగుతున్న తంతు. ఇది ఈ ఒక్క వ్యాపారితో ఆగిపోలేదు. ఇలాంటి ఫోన్ కాల్స్‌తో సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.కోటి రూపాయల వరకు వసూలు చేశారంటే వ్యాపారులు ఏస్థాయిలో మోసపోయారో అర్థమవుతుంది.

ఆదోని అర్బన్: ఇన్‌కమ్ ట్యాక్స్ పేరు చెప్పగానే వ్యాపారుల వెన్నులో వణుకు మొదలవుతుంది. వ్యాపారం సక్రమంగా నిర్వహిస్తూ, అందుకు సంబంధించిన రికార్డుల నిర్వహణ పక్కాగా ఉన్నట్లయితే ఎవరికీ భయపడాల్సిన అవసరం ఉండదు. అయితే ఇన్‌కమ్ ట్యాక్స్ విషయంలో అవకతవకలకు పాల్పడినప్పుడు ఉపద్రవం ఏవైపు నుంచి వస్తుందోననే భయం ఉండనే ఉంటుంది. ఈ కోవలోనే వ్యాపారుల్లో దాగి ఉన్న భయాన్ని సొమ్ము చేసుకునేందుకు సైబర్‌నేరగాళ్లు పథకం రచించారు. జీఎస్‌టీ నెంబర్ తెలుసుకుంటే చాలు.. ఆ వ్యాపారి వివరాలన్నీ చేతికొచ్చేస్తాయి. ఇక్కడే సైబర్‌నేరగాళ్లు తమ తెలివికి పదునుపెట్టారు. దుకాణాలపై రాసి ఉంటున్న జీఎస్‌టీ నెంబర్‌లను సేకరించారో, లేక ఆ వివరాలను ఎక్కడి నుంచైనా రాబట్టారో కానీ.. వాటితో ఎంచక్కా అజ్ఞాత ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి అవతారమెత్తారు. ఇంకేముంది.. వ్యాపారుల వివరాలన్నీ దగ్గర ఉంచుకొని ఒక్కక్కరికీ ఫోన్ కొట్టడం, వివరాలను తెలపడం.. ఈ పంచాయితీ అంతా ఎందుకు అనుకుంటే ఇంత మొత్తం ఫలానా నెంబర్‌కు ఫోన్‌పే చేయండని చెప్పడం జరిగిపోయింది. వ్యాపారులు కూడా ఎందుకు వచ్చిన తలనొప్పులని అడిగిన మొత్తం ఫోన్‌పే చేసి ఇన్‌కమ్ ట్యాక్స్ బారి నుంచి తెలివిగా బయటపడ్డామనుకొని లోలోపల సంబరపడ్డారు. ఎవరికైనా చెప్పుకుంటే తమ బొక్కలు బయటపడతాయని ఎవరికి వారు తేలుకుట్టిన దొంగల్లా ఉండిపోవడంతో గత 15 రోజులుగా సైబర్‌నేరగాళ్లు ఒక్కొక్కరి నుంచి రూ.15వేల నుంచి రూ.20వేల చొప్పున ఆదోని పట్టణంలో సుమారు రూ.కోటికి పైగానే ఊడ్చేశారు.

తెలివైన బెల్లం వ్యాపారి..

సైబర్ నేరగాళ్లు అందరి వ్యాపారుల్లానే పట్టణానికి చెందిన ఓ బెల్లం వ్యాపారికి కాల్ చేశారు. ఇతను బాగా చదువుకున్న వ్యక్తి, పైగా ఇన్‌కమ్ ట్యాక్స్ వ్యవహారాల్లో కాస్త అనుభవం ఉంది. ఈ నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేయగా, తన వద్ద అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయని, డబ్బులు ఇవ్వనని తేల్చి చెప్పాడు. అయితే ఒక గంటలో ఐటీ సార్ వస్తారు.. నీకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు పెనాల్టీ పడుతుందని భయభ్రాంతులకు గురిచేశారు. అందుకు బెల్లం వ్యాపారి కూడా అదేస్థాయిలో స్పందిస్తూ, పడితే పడిందిలే చూద్దామని చెప్పడంతో సైబర్ నేరగాడు ఫోన్ పెట్టేశాడు. ఆ తర్వాత సదరు వ్యాపారి జరిగిన విషయాన్ని పలువురు వ్యాపారులతో చర్చించాడు. దీంతో మోసపోయిన పలువురు వ్యాపారులు అప్పుడు విషయాన్నంతా ఆయనకు పూసగుచ్చినట్లు వివరించారు. ఈ తంతు గత 15 రోజులుగా పట్టణంలో జరుగుతున్నట్లు తెలుసుకున్న వ్యాపారులు తాము మోసపోయిన తీరుకు లోలోన మదనపడుతున్నారు. వందల సంఖ్యలో వ్యాపారుల ఈ కోవలో రూ.కోటికి పైనే పోగొట్టుకున్నట్లు అంచనా వేస్తున్నారు.

బాగా తెలిసిన వాళ్ల పనే..

జీఎస్‌టీ సమాచారం, ఇన్‌కమ్ ట్యాక్స్.. వ్యాపారుల వివరాలు తెలుసుకోవాలంటే సులువైన విషయమే కాదు. సాధారణంగా వ్యాపారులు ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్లు ఫైల్ చేసేందుకు చార్టెడ్ అకౌంటెంట్లను ఆశ్రయిస్తారు. వీళ్లు తమ వద్ద ఒకరిద్దరు జూనియర్‌లను ఏర్పాటు చేసుకుంటారు. వీరి వద్ద ఆయా వ్యాపారులకు సంబంధించిన వివరాలన్నీ అందుబాటులో ఉంటాయి. ఇలా పనిచేసి మానేసిన వారే సైబర్ నేరగాళ్ల అవతారం ఎత్తి ఈ దందాకు పాల్పడి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అధికారులైతే తప్పకుండా నోటీసులు ఇస్తారు

ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు తనిఖీలు చేయాలంటే తప్పనిసరిగా ముందుగానే నోటీసులు జారీ చేస్తారు. కనీసం సర్వే చేయాలన్నా కూడా నోటీసులు ఇచ్చే వస్తారు. అంతేకానీ ఎవరు పడితే వారు, ఫోన్లు చేసి ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులమని చెప్పి దాడులు చేయడం జరగదని ఓ ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి తెలిపారు.

క్లుప్తంగా

పంటల నమోదుకు నేడు చివరి రోజు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ పంటల నమోదు ప్రక్రియ 98.10 శాతం పూర్తయింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ నెల 15లోపు ఈ-పంట యాప్‌లో పంటలను నమోదు చేయాల్సి ఉంది. పంటల నమోదుకు చివరి రోజు ఆదివారమే. ఖరీఫ్ సాధారణ సాగు 10,35,895 ఎకరాలు ఉండగా.. 10,08,154 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో 9.89 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పంటలను నమోదు చేశారు. కల్లూరు, ఓర్వకల్, పెద్దకడుబూరు, మంత్రాలయం, ఆస్పరి, హలహర్వి, వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల్లో వంద శాతం పంటల నమోదు పూర్తయింది. మిగిలిన మండలాల్లో పంటల నమోదు 0.50 శాతం నుంచి 6 శాతం వరకు పెండింగ్‌లో ఉంది. నమోదు చేసిన పంటలకు సంబంధించి 9,59,915 హెక్టార్ల(97.06 శాతం)లో సాగు చేసిన పంటలకు వీఏఏ ఈ-కేవైసీ పూర్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్ఐకి గాయాలు

ఆదోని అర్బన్: రోడ్డు ప్రమాదంలో ఆదోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రామ్‌నాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని మోటారుసైకిల్‌పై ఇంటికెళ్తుండగా కొత్త బస్టాండు సమీపంలో ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఎస్ఐ చేతికి గాయాలయ్యాయి. గాయపడిన ఎస్ఐను చికిత్స కోసం కర్నూలుకు తరలించారు.

జీఓ 117ను రద్దు చేయాలి

కర్నూలు సిటీ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జీఓ 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు కె.సురేష్‌కుమార్, రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్మిక, కర్షక భవనంలో యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియంలో బోధన ఉండాలన్నారు. నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. పీఆర్‌సీ ద్వారా నివేదిక తెప్పించుకొని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలన్నారు. త్వరలోనే కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరులో యూటీఎఫ్ జిల్లా మహాసభలను నిర్వహించేందుకు ఆ మండల కమిటీ ముందుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌పాటి, సహాధ్యక్షులు హేమంత్‌కుమార్, మహిళా విభాగం సహాధ్యక్షురాలు జీవిత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగమణి, ఆర్థిక కార్యదర్శి యోహోషువ, జిల్లా కార్యదర్శి తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రాలో ‘మధు’రమైన విజయం

- జాతీయ జట్టుకు ఎంపికైన ఆలూరు యువకుడు
- ఏసియన్ బీచ్ చాంపియన్ పోటీల్లో పాల్గొనున్న క్రీడాకారుడు
- ఈ నెల 18 నుంచి 23 వరకు చైనాలో పోటీలు

సెపక్‌తక్రా అంటే పూర్తిగా తెలియని వయస్సు నుంచే ఆ క్రీడపై ఆసక్తి పెంచుకున్నాడు. పేదరికంతో అడుగడుగునా ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా తండ్రి ప్రోత్సాహంతో లక్ష్యం వైపు దూసుకెళ్లాడు. కోచ్ నుంచి మెలకువలు నేర్చుకుని నిరంతరం సాధన చేశాడు. అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జాతీయ స్థాయిలో సత్తా చాటాడు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికై దేశం తరపున పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారుడిని అందరూ అభినందిస్తున్నారు.



గోవా రాష్ట్రంలో నిర్వహించిన 37వ నేషనల్ గేమ్స్‌లో ఆడుతున్న మధు (ఫైల్)



జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించిన జట్టు సభ్యులతో..

ఆలూరు రూరల్: క్రీడల్లో రాణించేందుకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు ఆలూరు యువకుడు మధు. పట్టుదలతో సాధన చేసి అంతర్జాయతీ స్థాయి పోటీలకు ఎంపికై ఆదర్శంగా నిలిచాడు. ఆలూరులోని సిద్దేశ్వర కాలనీకి చెందిన బసవరాజ్, సర్వస్వతీ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. తండ్రి బసవరాజ్ చిరు వ్యాపారి. కొన్ని తోపుడు బండిపై పల్లీలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించాడు. ప్రస్తుతం ఆలూరులో గోబీ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. పేదరికం వెక్కిరిస్తున్నా.. పిల్లల ఇష్టాలను కాదనలేదు. కుమారుడు మధు సెపక్ తక్రా క్రీడలో రాణిస్తుండడంతో ఎక్కడ పోటీలు జరిగినా పంపేవారు.

మధు విజయ ప్రస్థానమిదీ..

కాలితో బాల్‌ను తంతూ పాయింట్లు రాబట్టే సెపక్ తక్రా క్రీడపై 8వ తరగతి చదివే రోజుల్లోనే మధు ఆసక్తి పెంచుకున్నాడు. విద్యార్థి ఆసక్తిని గమనించి ఓ ప్రైవేటు పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న హనుమేంతరెడ్డి ప్రోత్సహించాడు. ఎనిమిదో తరగతి చదువుతూనే కర్నూలు జిల్లా అండర్-14 సెపక్‌తక్ర జట్టుకు ఎంపికయ్యాడు. అక్కడి నుంచి వెనుతిరిగి చూడలేదు. అంచెలంచెలుగా ఎదిగాడు. ఆలూరులోనే పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన మధు జాతీయ స్థాయిలో 12 సార్లు సెపక్‌తక్రా క్రీడలో తన ప్రతిభ చాటాడు. అన్ని ఫార్మెట్లలో ఇప్పటి వరకు 14 పతకాలు సాధించాడు.

- 2014లో కర్నూలులో నిర్వహించిన 17వ సబ్ జూనియర్ సెపక్‌తక్రా పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించాడు.
- 2016లో నిర్వహించిన జూనియర్ నేషనల్ లెవల్ పోటీల్లో సిల్వర్ మెడల్ గెలుచుకున్నాడు.
- 2017లో హిమాచల్ ప్రదేశ్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్‌తో మెరిశాడు.
- 2018లో నిర్వహించిన పోటీల్లో బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నాడు.
- ఏపీలోని నారాయణపురంలో నిర్వహించిన 65వ స్కూల్ గేమ్స్‌లో పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించాడు.
- హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని రెండు బ్రాంజ్ మెడల్స్ గెలుచుకున్నాడు.
- 2023లో గోవాలో నిర్వహించిన 37వ నేషనల్ గేమ్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు.
- పదేళ్ల నుంచి జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చడంతో అండర్ 23 విభాగంలో ఆగస్టు 11న ఏసియన్ బీచ్ సెపక్‌తక్రా చాంపియన్ షిప్ పోటీలకు భారత జట్టు తరపున ఎంపికయ్యాడు. చైనాలోని కింగ్‌డావోలో ఈ నెల 18 నుంచి 23 వరకు పోటీలు జరగనున్నాయి.

కల నెరవేరింది



తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ హనుమంత రెడ్డి శిక్షణతో ఈ స్థాయికి చేరాను. ఏసియన్ బీచ్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. దేశం తరఫున ఆడాలనే నా కల నెరవేరింది. మొదటి సారి అంతర్జాతీయ పోటీలకు సొంత ఖర్చులతో చైనా వెళ్తున్నా. దాతలు ముందు వచ్చి ఆర్థిక సహాయం అందిస్తే సెపక్‌తక్రా క్రీడలో రాణించి దేశానికి మంచి పేరు తీసుకువస్తా.

– మధు, సెపక్‌తక్రా క్రీడాకారుడు

రాష్ట్రస్థాయి ఆట్యా-పాట్యా పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



పోటీల్లో పాల్గొనేందుకు తరలివచ్చిన వివిధ జిల్లాల జట్లు

కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో 9వ రాష్ట్రస్థాయి జూనియర్ ఆట్యా-పాట్యా పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతోనే క్రీడాకారులకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వస్తుందన్నారు. క్రీడల ద్వారా ఎంతోమంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఓడిన వారు మరింత సాధన చేసి రాబోయే పోటీల్లో విజేతలుగా నిలవాలన్నారు. క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి మంచి గుర్తింపు రావడమే కాకుండా ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం క్రీడా రంగానికి ప్రాధాన్యతనిచ్చి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆట్యా-పాట్యా సంఘం సీఈఓ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సాయిచరణ్, జిల్లా సంఘం అధ్యక్షుడు నాగరత్నమయ్య, బాలపవన్ తదితరులు పాల్గొన్నారు.

అన్సర్, కృష్ణ డైమండ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌లో ఆభరణాలను తిలకిస్తున్న ప్రజలు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో శనివారం అన్సర్ జ్యువెలర్స్ ఆధ్వర్యంలో కృష్ణ డైమండ్ ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర మంత్రి ఫరూక్, ఎంపీ శబరి, బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇంద్రారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్సర్ జ్యువెలర్స్ అధినేతలు అన్సర్‌బాషా, అమీర్ బాషాలు మాట్లాడుతూ ఈనెల 14, 15, 16 తేదీల్లో కృష్ణ డైమండ్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నామని, ఇందులో ఎన్నో ఆకర్షణీయమైన డిజైన్లు, తక్కువ ధరల్లో డైమండ్ ఆభరణాలు లభిస్తాయని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రూ.20వేలు డైమండ్ ఆభరణాల కొనుగోలుపై ఒక గిఫ్ట్ ఓచర్ ఇవ్వడం జరుగుతుందని, ఈ గిఫ్ట్ ఓచర్ బంపర్ డ్రాలో గెలుపొందిన వారికి రూ.5లక్షల విలువైన కారును అందజేస్తామన్నారు. మొదటి రోజు ఎగ్జిబిషన్‌ను ప్రజలు విశేషంగా ఆదరించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఫిరోజ్, అన్సర్ జ్యువెలర్స్ సిబ్బంది, కృష్ణ డైమండ్ సిబ్బంది ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వార్థానికి చెక్‌డ్యామ్ ధ్వంసం

- జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఫిర్యాదు



ధ్వంసమైన చెక్‌డ్యామ్

కర్నూలు(అగ్రికల్చర్)/కల్లూరు: జలాలతో నిండుగా కళకళలాడుతున్న చెక్‌డ్యామ్‌ను ఓ వ్యక్తి ట్రాక్టరుతో ధ్వంసం చేశాడు. ఆ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ రెడ్డికి ఫిర్యాదు చేశారు. కల్లూరు మండలం చిన్నటేకూరు, పెద్దటేకూరు గ్రామాల హద్దులలో ఉన్న గొర్లవాగు వంకకు రెండు వైపుల జిల్లా నీటియాజమాన్య సంస్థ వాటర్‌షెడ్ నిధులతో చెక్‌డ్యామ్ నిర్మించింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ చెక్‌డ్యామ్ పూర్తిగా నిండి పారుతోంది. దీంతో బావులు, బోర్లలో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. వీటి కింద మల్లెతోటలు, ఇతర ఉద్యాన పంటలు పెద్ద ఎత్తున సాగవుతున్నాయి. చెక్‌డ్యామ్‌లో ఉన్న నీటితో పశువులు, సన్న జీవాలు దాహార్తిని తీర్చుకుంటున్నాయి. చెక్‌డ్యామ్‌లో నీరు ఎక్కువై తన పొలాన్ని ముంచెత్తుతోందనే కారణంతో ఓ వ్యక్తి వారం రోజుల క్రితం ట్రాక్టరుతో చెక్‌డ్యామ్‌ను ధ్వంసం చేశాడు. దీంతో చెక్‌డ్యామ్‌లో చుక్కనీరు మిగలకుండా వృథాగా వెళ్లిపోయింది. చెక్‌డ్యామ్‌ను ఉద్దేశ్యపూర్వకంగా ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ చిన్నటేకూరు, పెద్దటేకూరు రైతులు జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సమగ్రంగా విచారణ జరిపించాలని పీడీ నిర్ణయించారు. వాటర్‌షెడ్స్ అదనపు పీడీ మాధవీలతను విచారణ అధికారిగా నియమించారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు



మాట్లాడుతున్న హృదయరాజు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల సమస్యలపై ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నిరంతరం పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు అన్నారు. ఏపీటీఎఫ్ ఆవిర్భవించి 80 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో కర్నూలు జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం జిల్లా విద్యా-వైజ్ఞానిక మహాసభలు నిర్వహించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధన చేసే పరిస్థితులు లేవన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని సర్దుబాటు ప్రక్రియ సాధ్యం కాలేదని, ప్రభుత్వం మూడు వేల అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను తక్షణమే మంజూరు చేయాలన్నారు. ముఖ్య అతిథిగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ.. 117 జీఓ రద్దు గురించి ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. జిల్లాలో విద్య, వైద్యం, సాగు, తాగు నీటి సమస్యల పరిష్కా రం కోసం చిత్తశుద్ధితో పని చేస్తానన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ చేసిన పోరాటాలను అభినందించాల్సిందేనని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. అనంతరం ఐఫియా జాతీయ చీఫ్ పాట్రాన్ కె.సుబ్బారెడ్డి పిల్లల్లో హింసాత్మక ప్రవృత్తి-విపరీత ధోరణులు-పరిష్కారాలు అనే అంశంపై వివరించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.ఇస్మాయిల్ అధ్యక్షతన నిర్వహించిన మహాసభల్లో ఏపీటీఎఫ్ పూర్వపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కుల శేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు మధుసూదన్ రావు, మహమ్మద్ రఫీ, కర్నూలు జిల్లా విభాగం కార్యదర్శి మారియానందం, ఏపీ పీఈటీ, పీడీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మయ్య, చందు నాయక్, ఎంఈఓల అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రుడు, ఎస్‌టీఏ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవస్వామి, ఎన్.శ్రీనివాసులు, ఇతర నాయకులు టీవీ రామకృష్ణ, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



ఇంటర్నేషనల్ బుక్ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించినట్లు పత్రాన్ని ఇస్తున్న రాజ లూత్ర

కర్నూలు (టౌన్): కర్నూలు నగర శివారులోని రీమా చర్చి కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన హ్యాండ్ రిటన్ బైబిల్ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. బైబిల్ రీడింగ్ చాలెంజ్ టీమ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశ నలుమూలల నుంచి 160 మంది మహిళలు పాల్గొన్నారు. ఒకేసారి అందరూ కలిసి 8 గంటల వ్యవధిలో బైబిల్ గ్రంథాన్ని చేతిరాతతో పూర్తి చేశారు. రాజస్థాన్‌కు చెందిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు చెందిన రాజ లూత్ర పర్యవేక్షణ చేసి రికార్డు నమోదు చేసినట్లు ప్రకటించారు. అనంతరం ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డును ప్రదానం చేశారు. గిప్సన్ చర్చి సీనియర్ పాస్టర్ కృపాదానం, నిర్వాహకులు ప్రశాంత్, మేరీ జోత్స్న, మేరీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

నందికొట్కూరు: పట్టణ పరిధిలోని ఏబీఎం పాలెంకు చెందిన కాటేపోగు ప్రకాశం(63) శుక్రవారం నీటి కుంటలో పడి మృతి చెందాడు. ఎస్ఐ సురేష్ బాబు తెలిపిన వివరాలు.. ప్రకాశంకు ఏబీఎం పాలెం సమీపంలో భూమి ఉంది. ప్రతి రోజు అక్కడికి వెళ్లి వచ్చేవాడు. అందులో భాగంగానే శుక్రవారం పొలానికి వెళ్లి చీకటి పడినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. శనివారం ఉదయం అటు వైపు పొలాలకు వెళ్లిన రైతులు నీటి కుంటలో మృతదేహం తేలియాడుతుండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కుమారుడు ఏసన్న ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తూ కాలు జారీ పడి మృతి చెందినట్లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెస్ట్‌జోన్ ప్రీపరేడ్‌కు ఎంపిక



పరుగు పోటీల్లో పాల్గొన్న వలంటీర్లు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) వెస్ట్ జోన్ ప్రీపరేడ్ ఎంపికలు శనివారం ఆర్‌యూలో జరిగాయి. ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ డైరెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో వలంటీర్లకు పరుగుపందెం, కవాతు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు వర్సిటీలో వెస్ట్‌జోన్ ప్రీ పరేడ్ ఎంపికలు జరిగాయన్నారు. ఎంపికలో పాల్గొనేందుకు స్పెషల్ క్యాంపు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ యూనిట్లకు మాత్రమే అర్హత ఉందన్నారు. ఎంపికలో రాయలసీమ విశ్వవిద్యాలయ యూనిట్‌తో పాటు నగరంలోని సెయింట్ జోసెఫ్స్ కళాశాల, సెయింట్ జోసెఫ్ మహిళా డిగ్రీ కళాశాల, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, నంద్యాల శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలల యూనిట్లు పాల్గొన్నాయన్నారు. మొత్తం 50 మంది వలంటీర్లు పాల్గొనగా ఇద్దరిని తదుపరి స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిని మహారాష్ట్రలో జరిగే ముందస్తు కవాతుకు పంపుతామని చెప్పారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వెంకటరత్నం, డాక్టర్ విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.



వలంటీర్లకు సూచనలిస్తున్నన్న ఎన్ఎస్ఎస్ అధికారులు